


# డిగ్రీ 'సినిక్'

కిల్లాన మోహనబాబు

ఆరోజే కాలేజీలో డిగ్రీ పరీక్షలు ప్రారంభం!

ఎప్పుడూ ఈలలతో, వింత వింత కేకలతో ప్రతిధ్వనించే కాలేజీ ఈరోజు చాలా నిశ్శబ్దంగా ఉంది. ప్రతి విద్యార్థి చేతిలోనూ ఒక పుస్తకం! వాళ్ల ముఖాల్లో చెప్పలేని గంభీరం!

ఇలాంటి వాతావరణాన్ని సంవత్సరానికి రెండుసార్లు గత ఐదేళ్లుగా చూస్తున్న నేను గబాగబా ప్రిన్సిపాల్ రూములోకి వెళ్లాను. అప్పటికే చాలామంది లెక్చరర్స్ అక్కడ కూర్చుని ఉన్నారు.

ఆరోజు ఇంగ్లీషు పేపరు. ఆ క్వశ్చన్ పేపర్ బండిల్ కూడా విప్పేశారు. నాతోపాటు 'కో—ఇన్విజిలేటర్' ఎవరా అని చూస్తే వీరభద్రరావు అని తేలింది. కొద్దిగా ఇబ్బందిగా ఫీలయ్యాను నేను. ఎందుకంటే వీరభద్రరావుది బలే విచిత్రమైన మనస్తత్వం. ఎప్పుడూ సీరియస్‌గా ఉంటాడు. అవసరమైతే తప్ప మాట్లాడడు. అతడుండేది మా ఇంటిపక్కనైనా మేం మాట్లాడుకునేది చాలా తక్కువ. అతని పదేళ్ల లెక్చరర్ సర్వీసులో కనీసం వో యాభైమంది విద్యార్థుల్ని స్లిప్ రాస్తుండగా పట్టుకుని 'డిబార్' చేయించి ఉంటాడు. అతను పోలీసు డిపార్టుమెంటుకి గాని వెళ్లి ఉంటే బాగా రాణించి ఉండేవాడని అంటుంటారు అందరూ.

ఇంతలో ఫస్టు బెల్లు మ్రోగింది. మేం నెమ్మదిగా పరీక్ష హాల్లోకి వెళ్లాం. అప్పటికే కొందరు విద్యార్థులు వారి సీట్లలో కూర్చుని ఉన్నారు. వీరభద్రరావుని చూసి వాళ్ల ముఖాలు ఆముదం తాగినట్లయిపోయాయి! 'వారి పాలిట ఇతను నిజంగా వీరభద్రుడే' అన్పించింది నాకు. ఇంతలో సెకెండ్ బెల్లు మ్రోగింది. దాదాపు అందరు విద్యార్థులూ వచ్చేశారు.

ఆన్సర్ పేపర్స్ పంచేశాం ఇద్దరం.

**"ఎవరి దగ్గరేనా ఎలాంటి స్లిప్స్ ఉంటే ఇప్పుడే ఇచ్చేయండి. తరువాత దొరికితే విచారించి ఫలితం ఉండదు?"** అని వార్నింగ్ పారేశాడు వీరభద్రరావు.

విద్యార్థుల మొఖాల్లో ఆందోళన, భయం, దిగులు ఒక్కసారిగా వ్యాపించాయి!

ఇంతలో థర్డు బెల్లు మ్రోగింది. క్వశ్చన్ పేపర్లు పంచేశాం. విద్యార్థులు ఆ ప్రశ్నలు చదువుతున్నపుడు వాళ్ల మొఖాల్లో కన్పించే 'సీరియస్‌నెస్' చూస్తుంటే 'ప్రపంచంలోని నిశ్శబ్దం అంతా గూడుకట్టుకుని ఇక్కడకు వచ్చిందా' అని అనిపించింది నాకు. నిజంగా ఇవి వారి జీవితాల్లో ముఖ్యమైన మలుపు తెచ్చే క్షణాలు. నేను విద్యార్థిగా ఉండే రోజులు గుర్తొచ్చాయి నాకు. నేను ఇలాంటి సమయాల్లో ఎంత దిగులు పడిపోయేవాన్నో గుర్తొచ్చి నవ్వొచ్చింది నాకు.

ప్రశ్నలు కష్టంగా ఉన్నాయి కాబోలు కొందరు విద్యార్థులు దిక్కులు చూస్తున్నారు. కొందరు దీర్ఘంగా ఆలోచిస్తున్నారు. మరికొందరు వచ్చిన ఆన్సర్స్ గబగబా రాసేస్తున్నారు. టైం గడవడం కష్టంగా ఉంది నాకు. వరసగా మూడు గంటలు క్లాసుల్లో అరవచ్చుకానీ,ఏమీ పని లేకుండా పరీక్ష హాల్లో పోలీసు డ్యూటీచేయడం అంటేమాత్రం మహా బోర్ కొడుతుంది నాకు!

ఇంతలో

" . గెటప్. ఆ స్లిప్ ఇలా ఇవ్వు" అన్న వీరభద్రరావు కంఠం విని తుళ్ళి పడ్డాను నేను. అప్పుడే ఒక కేసు పట్టేశాడన్నమాట అనుకున్నాను.

" 'సారీ. ఈ సారికి వదిలేయండి. ప్లీజ్ ఇంకెప్పుడూ చేయను సార్" అని బతిమాలడం ప్రారంభించాడు ఆ స్టూడెంట్.

"నథింగ్ డూయింగ్" అని ఆ స్లిప్ తీసుకుని అతడి ఆన్సర్ షీట్‌కి గుచ్చాడు వీరభద్రరావు.

"నాతో ప్రిన్సిపాల్ రూమ్‌కి రా" అంటూ ఆ స్టూడెంట్‌ని తీసుకుని ప్రిన్సిపాల్ రూమ్‌కి వెళ్ళాడు వీరభద్రరావు.

కన్ను మూసి తెరిచే లోగా జరిగి పోయిం దా సంఘటన. అంతా కళ్ళప్పగించి చూస్తున్న స్టూడెంట్స్ మళ్ళీ తలలు వంచి పేపర్లు రాయడం మొదలు పెట్టారు.

ఒక పది నిముషాలు తర్వాత వీరభద్రరావు మళ్లీ హాల్లోకి వచ్చాడు.

"చూశారా—ఆ స్టూడెంట్ కనీసం మూడేళ్ళు పరీక్ష ముఖం చూడక పోవడం ఖాయం. నిజానికా

అలాంటి గతి పట్టకుండా ఉండాలంటే తిన్నగా ఉండండి'' అని మరో వార్నింగ్ ఇచ్చి వదార్లు ప్రారంభించాడు.

ఏలాగయితేనేం ఆ తరవాత రెండు గంటలూ గడిచిపోయాయి!

అదృష్టవశాత్తూ మరెవరూ దొరకలేదు.

ఆఖరి బెల్లు అయిన తర్వాత అందరి దగ్గరా పేపర్లు తీసుకుని నంబరు ప్రకారం కట్టకట్టి ప్రిన్సిపల్ రూంలోకి ఇచ్చేశాం.

ఎప్పుడూ అందరినీ బెదిరించి కేసులు పట్టుకోవడంలో ఉన్న ఆనందం ఏమిటో అని వీరభద్రరావుని అడిగి తెలుసుకోవాలన్న కుతూహలం నాలో కలిగింది. ఇద్దరి ఇళ్ళూ ఒకే వీధిలో ఉండడంచేత కలిసే బయలుదేరాం.

''పాపం. ఆ కుర్రవాణ్ణి చూస్తుంటే జాలేసింది నాకు '' అని కదిపాను నేను.

''వెధవలు! స్లిప్పులు తేవడం ఎందుకు? దొరికిపోతే విచారించడ మెందుకు? వాడికీ శిక్ష కావలిసిందే అప్పుడప్పుడూ ఇలా జరిగితే గాని మిగతా వాళ్ళకి బుద్ధిరాదు. అసలు వాడు స్లిప్పు తీస్తుండగానే చూశా న్నేను. అయినా కొంతసేపాగి, వాడు అది చూసి రాస్తున్నప్పుడు పట్టుకున్నాను తెలివిగా'' అన్నాడు వీరభద్రరావు.

షాక్ తగినట్లయింది నాకు.

★

ఈ ప్రపంచంలో నెగ్గుకు రావడానికి యోగ్యుల్నీ, వివేకవంతుల్నీ, ఎన్నిక చేయడంకన్న, అయోగ్యుల్నీ, అవివేకుల్నీ గుర్తించి, దూరంగా ఉండడం అవసరం.

— టాసీయార్డ్

★

''వాడు స్లిప్ తీసిన వెంటనే మీరు అది తీసుకుని చింపేసి ఉంటే పాపం అతడు డిబార్ అయ్యే ప్రమాదం నివారించి ఉండేవారు కదా'' అన్నా న్నేను. ఎంత ఆపుకుందామన్నా నా గొంతులో కాస్త కోపం ధ్వనించింది.

''మొదటే ఆ స్లిప్పు తీసుకుంటే అతనిచేత కమిట్ చేయించడం ఎలా?'' తిరిగి ప్రశ్నించాడు వీరభద్రరావు.

''అంటే మీకు ఆధారం దొరకడంకోసం అతనిచేత కమిట్ చేయించి పట్టుకున్నారన్నమాట'' అన్నా న్నేను మొహం చిట్లించి.

''మీరు ఆ కుర్రవాడి తరపున వకాల్తా పుచ్చుకుని మాట్లాడుతున్నట్లుందే...'' నా కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు వీరభద్రరావు.

''ఆహా. అదికాదు. ఒక్కసారి ఆలోచించండి. స్లిప్పు తేవడం తప్పే. నేను కాదనను. అది మీరు వెంటనే తీసుకొని చింపేసి ఉంటే అతనికింక శిక్షపడి ఉండేది కాదు. కొంత టైం అయిన తర్వాత పట్టుకోవడం అంటే పరోక్షంగా ఆ తప్పుని మనమే ప్రోత్సహించడమన్నమాట! ఒకడు ఒక అమ్మాయిని రేప్ చేయబోతున్నాడనుకోండి. అక్కడ మీరుంటే ఏం చేస్తారు? వాడికి పూర్తిగా అవకాశం కల్పించి తరువాత వాడిని పట్టుకుంటారా? లేక అది జరగకుండా ముందే ఆపుతారా?'' ఆవేశంగా అతనివేపు చూస్తూ అన్నా న్నేను.

అతని తల తిరిగి పోయినట్లయింది. ఏం మాట్లాడాలో అతనికి అర్థం కాలేదు. ఇంతలో మా ఇళ్ళు వచ్చేశాయి. ''మరి వస్తా'' అంటూ తన ఇంటికి వెళ్ళిపోయాడు వీరభద్రరావు. నేను కూడా నెమ్మదిగా ఇంట్లోకి అడుగు పెట్టాను.

ఈ సంఘటన జరిగిన ఎన్నో రోజులకిగాని నాకు తెలియలేదు— వీరభద్రరావు తన 'బియ్యే' పరీక్షల్లో 'స్లిప్స్' రాస్తుండగా దొరికిపోయాడనీ— రెండేళ్ళు యూనివర్శిటీ వాళ్ళు 'డిబార్' చేశారనీ! ✻

మోపెడ్లలో ప్రత్యేక స్థానం—అదే సువేగా యొక్క ప్రథమస్థానం

సువేగా: బండిని సులభముగా నడుపుటకు మొట్టమొదటగా ఆటోమెటిక్‌క్లచ్ కలది

సువేగా ఇటువంటి ఆటోమెటిక్ క్లచ్‌గల మొదటి మోపెడ్. దీనిని నడుపువారు తరచు క్లచ్ మార్పులు చేయనక్కర్లేదు. అంతేకాదు ఎక్కువ వైశాల్యమున్న ఈ ఆటోమెటిక్ క్లచ్ చక్రములకు గియర్‌ల నుండి అధికశక్తి ప్రసారము చేస్తుంది. ఈ విధంగా జారుదు కూడా చాలా తగ్గును. దీనివలన అధిక భారమునుగాని మరియొక మనిషినిగాని సులభముగా మోసికొని పోగలదు.

ఇంకను ఉత్తమ గుణములు:

- చెయిన్‌డ్రైవ్ మరియు చక్కని స్థిరత్వమునకు లోవైపున దిట్టమైన బాక్సు సెక్షన్ ఫ్రేము.
- ఆరనవసరమున్నంత మరియు అదనపు ప్రయాణమునకు తగిన హార్డ్‌క్రోమ్ అల్యూమినియం సిలిండర్లు.
- సులభమైన కదలికకు, విడిభాగముల బహుకాలమన్నికకు నీడిల్‌రోలర్ బేరింగులు.

వీటన్నింటికి మించి సువేగాకు అమ్మకము తర్వాత విరివి అయిన అనుబంధ సర్వీసు వసతులు. ఇండియా అంతయు విడిభాగములు లభించు వసతులు అందగాగలవు.

